# మాజీ భర్త

"కొత్తఆఫీసరు వస్తున్నారుట"

ఉదయం గం. 10.30 ని ఆఫీసులో ఆ వార్త ఆటంబాంబులా పేలింది. ఆ సమయానికి సీట్లో కూర్చోవలసిన వారంతా గుంపులు గుంపులుగా సీట్లదగ్గర నిలబడి మాట్లాడు కుంటున్నారు.

అప్పుడే ఆఫీసులో అడుగు పెట్టిన మాయారావు ఆ వార్తవిని

"ఎప్పుడొస్తున్నాడట" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"ఈరోజే ఇప్పుడే! ఒకక్షణంలో రావచ్చు. ఒక నిమిషంలో రావచ్చు. లేక ఒక గంట పట్టచ్చు." సోమసుందర్ సమాధాన మిచ్చాడు.

"ఆఫీసర్ వస్తోందిరాబాబు" హడావిడిగా పరుగెత్తుకొచ్చిన శేఖర్ కొత్తన్యూస్ అందించాడు.

అక్కడున్నవారంతా కలిసి శేఖర్‌చుట్టు చేరారు.

"నీకెవరు చెప్పారురా" మాయారావు ప్రశ్నించాడు.

"ఎవరు చెప్పడమేమిటి నీమొహం ఆవిడగారి పి. ఎ. స్వయంగా చెప్పాడు," ఆమాటలంటూ శేఖర్ అందరివైపు గర్వంగా చూసాడు.

''పెళ్ళయిందా?''

''పిల్లలున్నారా''

"మని షెలా ఉందిట!"

''వయసులో ఉందా వయసు మళ్ళిందా!''

ఎవరి ఆసక్తికొద్ది వారు ప్రశ్నల వర్షం కురిపించడం మొదలు పెట్టారు.

నిజంగా శేఖర్‌కి తెలిసిన విషయం కొంతే అయినా గుక్క తిప్పకోకుండా అందరికి సమాధానాలు చెబుతున్నాడు.

''బహుశా వయసులోఉన్నట్లే అనిపిస్తోందోయ్'' మాయా రావు లొట్టలేసాడు.

''వయసులోనే కాదండీ అందంలో మిలమిలా మెరిసి పోతూ ఉంటుందిట'' శేఖర్ మరింత కల్పించి చెప్పాడు.

''ఇంకేం మన అదృష్టం పండిందోయ్'' మాయారావు పక్ళికిలించాడు.

మిగిలిన వాళ్ళంతా హాయిగానవ్వారు.

''ఈ శుభ సందర్భంలో ఓ కప్పు టీ ఏనా నోట్లోపడక పోతే ఏంబాగుండలేదయ్యా'' వయస్సు మళ్ళిన రామస్వామిగారు టీ సంగతి జ్ఞాపకం చేసారు.

''అవునండీ! అప్పుడే మనంవచ్చి అరగంట అయింది. టీ సంగతే మర్చిపోయాం.'' అటుపోతున్న బోయిని పిలిచి ఆర్డ రిచ్చాడు శేఖర్.

కప్పుల్లో సిద్ధంగాఉన్న అన్న "స్ప్రింగ్ టీసార్" అంటూ అందరికి టీ అందించాడు.

"వట్టి టీ యేనా? హాట్ డ్రింక్స్ లేవా?" "సోమసుందర్ అడిగాడు.

"ఈపూట టీ యే గతి" శేఖర్ సమాధానమిచ్చాడు.

అందరు టీ తాగడం మొదలు పెట్టారు.

అది ఆఫీసులాలేదు. సినిమా ఇంట్రవెల్‌లో జనం చుట్టూ చేరిన టీ స్టాలులా ఉంది ఆఫీసు.

అప్పుడే ఆ కొత్త ఆఫీసరు కారుదిగి ఆఫీసులో అడుగు పెట్టడం ఎవరూ చూడలేదు.

ఆవిడతో వచ్చిన పి. ఎ. అక్కడి అటెండర్‌తో ఏదో చెప్పాడు. అతను సంగతి గ్రహించి కంగారు పడిపోయాడు. తన ఉద్యోగం పోయిందేమోనని వణికిపోయాడు.

ఆవిడ చేతివాచి చూసుకుంది. 11 గం. 30 ని. అయింది. కోపంతో ఆవిడ ముఖం కందగడ్డలా అయింది, అయినా ఆవేశం అణుచుకుంది.

"మిస్టర్ దత్తా సీటు చూపించు" ఉరుములా గర్జించింది.

ఆ అరుపువిని ముందుగా తలతిప్పి చూసిన మాయారావుకు పెద్దపులిలా కనబడింది ఆవిడ. నోటిమాట లేక అలాగే ఉండి పోయాడు.

పి. ఎ దత్తా ముందు నడుస్తుంటే బాగ్ చేత్తో పట్టుకుని నడుస్తు వెళ్ళి తన సీట్లో కూర్చుంది జయాదేవి. గాంభీర్యమైన

ఆవిడ రూపన్ని చూసేటప్పటికి అందరికి చెమటలు పట్టాయి. అద్దాల్లోంచి అందరిని ఆవిడ గమనిస్తున్నట్లు తెలిసి అందరు వెళ్ళి సీట్లలో కూర్చోన్నారు. కాని ఎవరు ఫైల్సు తెరవలేక పోయారు.

''కొంచెం సీరియాస్‌లాఉంది'' మాయారావు పక్కవాని చెవులో గొనిగాడు.

''ఆ నామొహం, కొస్త సీటు కొత్తకదా. కొత్తమోజు. రెండు రోజులుంటే సరి ఆమే సద్దుకుంటుంది.'' అన్నాడు వయసుమళ్ళినాయన.

''మంచి అందగత్తెరా'' అన్నాడు శేఖర్.

ఆ మాటలువిన్న జయాదేవి కోపం పట్టలేక పోయింది. ఇంకవీళ్ళను వదిలితే లాభం లేదనుకుంది.

కాలింగ్‌బెల్ చేత్తోనొక్కింది. అది గుర్‌మనగానె అటెండర్ తలుపు తోసుకుని పరుగెత్తుకెళ్ళి సలాంకొట్టి నిలబడ్డాడు.

''మాయారావుగార్ని పిలు'' తలఎత్తకుండానె ఫైల్సు చూస్తూ చెప్పింది.

అతను ఒక్క పరుగులో బయటకు వచ్చి మాయారావుకు ఆ వార్త అందించాడు.

మాయారావుకు ఎందుకో, భయమనిపించింది. లేచి నిలబడ్డాడుకాని కాలు కదపలేకపోయాడు.

''అలా భయపెడితే ఎలా మాయారావు ఎంత మంది కొమ్ములు తిరిగిన ఆఫీసర్లు మన్నిచూసి పారిపోలేదు. ధైర్యంగా సమాధానాలు చెప్పు. వెంటనే ట్రాన్సఫర్ చేయించుకుని పారిపోతుంది.'' అందరూకలిసి ధైర్యం చెప్పారు.

అటెండర్ డోర్ తీసి పట్టుకుంటే గదిలో అడుగు పెట్టిన మాయారావు కర్చీఫ్ తీసి పట్టిన చెమటలు తుడుచుకున్నాడు.

జయాదేవి తలఎత్తి చూడలేదు. అతను రాసిన ఫైల్ చూస్తోంది.

''క్రిందటి మార్చిలో అడిగిన లెటర్‌కి ఈ మార్చిలోనా సమాధానం ఇవ్వడం'' ఆవిడ గొంతుక ఖంగుమంది. అతను సమాధానం ఇవ్వలేదు.

''పైగా లెటర్లో అడిగిన పాయింట్లు ఏమిటి? మీరు రాసిన సమాధానం ఏమిటి?''

తల దించు కున్నాడు మాయారావు.

''ఇన్ని తప్పులుతోనా లెటర్ రాయడం. తిరిగి అర్జంటుగా రాసి పట్టుకురండి'' ఫైలు ముందుకుతోసింది.

అంత విశాలమైన ఆ గది మాయారావుకు ఇరుగ్గా అనిపించి ఊపిరి సలపలేదు. నోరెండిపోయి మాట రాలేదు. ''ఇంక వెళ్ళొచ్చు'' అన్నట్టుగా ఆవిడ మరో ఫైలు తీసింది.

ఎలాగో ధైర్యం తెచ్చుకున్నాక మాయారావు ఫైలు అందుకుని కారే చెమటలతో బయట పడ్డాడు.

''ఆ చెమటలేమిటి మాయారావు?

''బాగా తిట్టి పంపిందా?''

''అసలు ఏంజరిగిందో చెప్పు మాయారావు''

ఆదుర్దాగా ప్రశ్నలుమీద ప్రశ్నలు వేస్తున్నారు. అందరూ.

''మరో కప్పు కాఫీ తాగితే మంచిది''

''ఊరుకోండిరా బాబు వింటే బాగుండదు''

''నోరుమూసుకోరా ! అంత భయపడితేఎలా ! నన్ను పిలిస్తేనా ! ఆ ఫైలు ఆవిడ మొహాన్న పడేసి వచ్చేవాడిని'' శేఖర్ నొక్కి చెప్పాడు.

అంతలో కాలింగ్ బెల్ మళ్ళీ మోగింది.

"ఈసారి ఎవరిని పిలుస్తుందోరా!" అన్నాడు భయంగా మాయారావు.

అటెండర్ పరమసంతోషంగా గదిలో అడుగు పెట్టి సలాంకొట్టి నిలబడ్డాడు. ఆఫీసులో ఎవర్ని తిట్టినా అతనికి చాలా సంతోషం. తనొక్కడే పని సక్రమంగా చేస్తున్నాననుకుంటాడు.

"సోమసుందర్‌గారిని పిలు"

తూనీగిలా పరుగెత్తుకుంటూ వచ్చి ముసిముసి నవ్వులతో చేరేసాడు వార్త.

అప్పటివరకు అంత ధైర్యంగా మాట్లాడిన సోమసుందర్ వెన్నెముకలో కాస్త చలిపుట్టుకొచ్చి నట్లనిపించింది.

తోటివారంతా ధైర్యాన్ని నూరిపోసారు.

లేని ధైర్యం తెచ్చుకుని గదిలో ప్రవేశించి ఎటో చూస్తూ నిలబడ్డాడు.

"ఈ కేసు సరిగా పరిశీలించారా" జయాదేవి గొంతు పిడుగుపడినట్లు వినబడింది.

ఉలిక్కిపడ్డ సోమసుందర్‌కి కళ్ళు చీకట్లు కమ్మాయి.

సమాధానం ఇవ్వలేకపోయాడు.

"ఈ లెటర్‌లో ఉన్నదేమిటోమీకు అర్థమయిందా! సమాధానం కావాలి" రెట్టించింది.

"అర్థమయింది" మాటలు తడబడ్డాయి.

"అర్థమయితే 'నో' అని ఎందుకు రాసారు.

"అది-అది-" తడుముకున్నాడు.

"ఏం తగిన లంచం దొరకలేదా? మళ్ళీ పుటప్‌చేసి 'యస్' అని రాయండి. ఫైల్ వెంటనే పంపించండి.

ఫైలు ముందుకు జరిపి మరోఫైలు తీసింది.

సోమసుందర్‌కు తల తిరిగిపోయింది అదుపులో పెట్టుకుంటూ వెళ్ళి పైలు తీసుకుని సీటువైపు నడిచాడు.

అంతటిధైర్యస్తుడూ అలా నీరసంగా తిరిగివస్తుంటే మిగిలిన వాళ్ళు నీరసపడిపోయారు అతను ఏమీ చెప్పకుండానె జరిగిన సంగతి తెలుసుకున్నారు.

ఇంతమంది కలిసి ఆవిడను భయపెట్టి ట్రాన్సఫర్ చేయించకుని వెళ్ళేటట్టు చేద్దామనుకున్నారు కాని ఇప్పుడు వాళ్ళనే నోరు మెదపకుండా చేస్తోంది. ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో వారికి తెలియలేదు. వారిలో చెప్పలేని ఆరాటం ప్రారంభమై అసలు ఫైల్స్ తెరవలేకపోయారు.

ఒకరిద్దరు తెరిచినా అందులో ఏముందో సరిగా అర్థమే కావడంలేదు వారికి.

అంతలో ఒంటిగంట కొట్టడంతో అందరూ లేచి ఎదురుగా ఉన్న హోటల్‌వైపు నడిచారు.

జయదేవి మాత్రం సీట్లో అలాగె కూర్చుండి పోయింది. ఆవిడ ఊహించుకున్నట్లుగానె ఆ ఆఫీసు ఉండడంవల్ల ఆవిడ ఎక్కువ ఆశ్చర్య పోలేదు. వారిని దారిలో పెట్టడానికి ఆలో చిస్తోంది.

అటేండర్ని పిలిపించి కొన్ని బోర్డులు తయారు చేయించ మని చెప్పింది.

ఎదురుగా షాపులోఉన్న నలుగురు పైంటర్స్‌ని వెంటనే పిలిపించాడు అతను.

కొన్నిటిమీద "పొగత్రాగరాదని," కొన్నిటిమీద "నిశ్శబ్దము" అని కొన్నిటిమీద ఆఫీస్ అవర్స్ 10 ఎ.ఎమ్ నుంచి 5 పి.ఎమ్. అని రాయమని చెప్పింది.

ఆఫీసువారు టిఫిన్ తిని పాను నములుకుంటూ సీట్లలోకి వచ్చేటప్పటికి సుమారు 2 గం. 45 ని అయింది. ఈలోపుగా పైంటర్‌పని పూర్తిచేసి ఆవిడ చెప్పినట్లు గోడలకు తగిలించి వెళ్ళిపోయారు,

ఆఫీసులో అడుగుపెట్టిన మాయారావు వాళ్ళు ఆ బోర్డులు చూసి ఆశ్చర్యపోయారు. తలొంచుకుని సీట్లవైపు నడిచారు.

జయాదేవికి పక్కనే నిలబడి ఫ్లాస్కులో కాఫి అందిస్తూ అటెండరు పోచయ్య గర్వంగా చూశాడు.

"సీపని ఎప్పుడో పడుతుందిలే" అనుకున్నారు అంతా.

"జయాదేవికాదు కానీ మన పాలిటి , ఓటమిలా ఉందిరా" అన్నాడు మాయారావు.

"ఫైల్సు ముట్టుకోకపోతే ఏచేస్తుంది? నేను ముట్టుకోను" సోమసుందర్ పేచీపెట్టాడు.

"నేను సిగరెట్టు కాల్చకుండా ఉండలేను. కాల్చి చూపిస్తా? ఏంచేస్తుందో చేసుకోమను" సిగరెట్టు తీసాడు శేఖర్.

"మొదటిరోజే ఆవిడతో గొడవ ఎందుకండీ? మన పని మనం చేసుకుపోతేసరి" అన్నాడు ఒకతల నెరిసిన ఉద్యోగి.

"పనిచెయ్యకుండా కూర్చోడం మంచిదికాదు. ఈపని చెయ్యడానికే కదా! జీతం పుచ్చుకునేది" కొత్త ఉద్యోగంలో చేరిన రాజా బాధ్యత జ్ఞాపకం చేసాడు.

''సరే తప్పుతుందా! ఏదోఒకపని చెయ్యాలిగా'' అనుకుంటూనె చాలామంది ఫైల్సు తెరిచారు.

మాయారావుకు చదివినకొద్దీ ఆ లెటర్ గందరగోళంగా కనబడుతోంది. ఆవిడ పిల్చి మళ్ళీ అడుగుతుందేమోనని లోపల చెప్పలేని కంగారుగాఉంది.

అతనీకేసు అసలు చదవలేదు. పాతఫైలుమీద రిజక్టుచేస్తూ రాసిఉన్న లెటర్ చూసి రాసేసి పంపించాడు.

''నయం ఇంకా డిటేల్సు అడిగిందికాదు. చచ్చే వాడిని, ఈసారి కేసుచదివి పుటప్‌చెయ్యాలి. ఎందుకైనా మంచిది'' అనుకున్నాడు మాయారావు.

సోమసుందర్ కూడా అదేస్థితిలో ఉన్నాడు. ఫైలుముందు వెనకా తిరగేస్తున్నాడు. అలవాటులేని మూలంగా కాస్త తల నొప్పిగా అనిపించింది. రోజూ ఈపాటికి నాలుగుసార్లు టీ తాగే వారు. ఎందుకో ఈ రోజు మరింత భయపడు తున్నారు.

ఏ భయం బాధా లేకుండా శేఖర్ అటు ఇటు చూస్తూ కబుర్లు చెబుతున్నాడు. సిగరెట్లు కాల్చకపోతే అతనికి అసలు తోచదు. అందుకే మాటిమాటికి బయిటకు వెళ్ళి సిగరెట్లు కాల్చుకు వస్తున్నాడు. ఆఫీసరు అందరిముందు తననుపిల్చి చివాట్లు వెయ్య నందుకు చాలా గర్వంగా భావించాడు. అందరూ చూసారో లేదో నని మరీ తిరుగు తున్నాడు.

అప్పుడే సాయంకాలం 4 గం॥ అయింది.

మొదటి రోజుకదా! ఆవిడ పెందరాళె వెళ్ళి పోయిందని అందరూ ఎదురు చూస్తున్నారు.

అంతలో గుర్‌మంటూ బెల్ మోగింది. అది యముని కేకలా అనిపించింది అందరికి. కొంత మందికి వెన్నులోంచే చలి పుట్టుకొచ్చింది. ఎవరికి ఆ పిలుపే తెలియదు.

లోపలకు గబగబా వెళ్ళిన పోచయ్య అంతకంటె వేగంగా బయటకు తిరిగి వచ్చాడు.

ఎవరు తలెత్తిచూస్తే వాళ్ళను పిలుస్తోందోనని అందరూ తలలు ఫైళ్ళలో దూర్చుకుని కూర్చున్నారు.

శేఖర్ మాత్రం కాలుమీదకాలు వేసుకుని కూర్చున్నాడు.

''మిమ్మల్నే పిలుస్తున్నారు'' శేఖర్ సీటుదగ్గరకువచ్చి చెప్పాడు పోచయ్య.

''నన్నా''

''అవునండి''

''శేఖర్ జాగ్రత్త, నువ్వేనాకాస్త ధైర్యంగా మాట్లాడి మన పరువు నిలబెట్టెరా'' అంటూ ఎన్నోసార్లు చెప్పారు అంతా.

''నాకేంభయం చూస్తూ ఉండండి నన్నేమేనా అంటే ఆ ఫైలు ఆవిడ మొహాన్న కొట్టి తిరిగి వస్తాను''

స్ప్రింగ్ డోర్ తెరుచుకుని లోపల అడుగు పెట్టాడు.

ఆవిడ ఏదో ఫైలు చూస్తోంది. ఆవిడ కూర్చోమనకుండానే వెళ్ళి ఆవిడకు ఎదురుగాఉన్న కుర్చీలో కూర్చున్నాడు. బయట నున్న వాళ్ళంతా చెవులురిక్కించి అద్దాల్లోంచి తొంగిచూస్తున్నారు.

''మీ ఫైలు రెడీగాఉందా?''

''ఏంఫైలు''

''మనం ఎస్టిమేషన్ అడిగిన ఫైలు''

''ఇంకాస్టడీ చెయ్యలేదు''

''రెండు నెలలు చాలలేదా?''

''లేదు ఆర్నెల్లు పట్టచ్చు''

''మీరెళ్ళి ఇంట్లో కూర్చోవచ్చు.''

చెప్పడం అయిపోయినట్టు ఆవిడ ఆ ఫైలు పక్కన పడేసింది. మరొఫైలు తీసింది

శేఖర్ ఏంచెయ్యాలో తోచక తలొంచుకుని అలాగె నిలబడ్డాడు.

ఆవిడకు వెళ్ళిపోయిన ఆఫీసరు చెప్పిన సంగతులు గుర్తు కొచ్చాయి.

''అతను పనిదొంగ. కబుర్లుచెప్పి దాటుతాడు. పదిమందిలో చేరి చూడనిదాన్ని చూసినదాన్ని గోరంతలు కొండంతలు చేస్తూ నమ్మిస్తుండాడు. పైగా బ్రాందీ, విస్కీవంటి ఖరీదైన సీసాలు కస్టమర్స్ దగ్గర పుచ్చుకుని ఆఫీసు అలమారులోనె దాస్తూంటాడు. అది అతనికి కస్టమర్సు నేర్పిన అలవాటు. అతను ఆఫీసర్సుకు అందిస్తూ ఉంటాడు. దానికి లొంగని ఆఫీసరుండరని అతని అపోహ.''

వస్తున్న కోపాన్ని అణచిపెట్టుకుంది జయాదేవి. అతని వెళ్ళిపోడానికి కదిలాడు.

''పోచయ్యా! కబోర్డు తాళాలు ఇచ్చి వెళ్ళమను''

"కబోర్డు తాళాలెందుకు?"

''చెక్ చెయ్యడానికి,'' అలమారులో ఉన్న సీసాలు బయటకు పడేయించడానికి ''ఇది ఇల్లు కాదు ఆఫీసు''

చలిజ్వరం వచ్చినవాడిలా వణకడం ప్రారంభించాడు శేఖర్, అవన్నీ ఆవిడకు ఎలా తెలిసాయో అర్థంచేసుకోలేక పోయాడు.

''నా పెర్సనల్ విషయాలు మీకనవసరం?'' రెట్టించాడు శేఖర్.

"ఇది ఆఫీసుకు సంబంధించిన విషయం. పైగా మీ పెర్సనల్ విషయాలు సెట్ చెయ్యడానికే ఇక్కడకు వచ్చాను.''

"నువ్వా? నువ్వా"

"నేనా ఒకప్పటి విజయమ్మనని గుర్తుచెయ్యడానికి ఇక్కడకు వచ్చాను."

శేఖర్‌కి భూమి కంపించి నట్లయింది. నిలబడలేక కుర్చీలో చదికిలబడ్డాడు. ఎయిర్ కండిషన్ రూములో చెమటలు పట్టాయి.

గతంలోకి వెళ్ళింది అతని మనస్సు. విజయమ్మ పేరును జ్ఞాపకం చేసుకున్నాడు. తలెత్తి ఆవిడను పరిశీలనగా చూసాడు. విజయమ్మ చామన చాయలో కాస్త పొట్టిగావుండేది. పొట్టిజడ. లంగాఓణీ అచ్చు పల్లెటూరి వేషం, ఎక్కువ చదువుకోలేదు. తల్లితండ్రులు బలవంతంగా కుదిర్చారు. పిల్ల నచ్చలేదని పెళ్ళయిన మూడో రోజే తిరిగి వచ్చేసాడు. తిరిగి ఆమెను చూడలేదు. తల్లి తండ్రులు, ఎన్నోసార్లు ఆ విషయం ప్రస్తావిస్తే వినిపించుకోలేదు. అత్తమామలు వచ్చి ఏడిస్తే తనకేం సంబంధంలేదని తప్పించుకున్నాడు. అతనికి చెప్పలేని ఆశ్చర్యంవేసింది.

జయాదేవిని మరోసారి పరిశీలనగా చూసాడు. చక్కని రంగుతో లావుకు తగిన పొడవుతో ఎంతో ఠీవిగావుంది. తల దువ్వి ముడి వేసింది. ఒక పక్కగా ఎర్రగులాబీ తురుముకుంది. తెల్లని పాదాలకి నల్లని చెప్పులు సన్నగా పొడవుగా ఉన్న చేతి వేళ్ళకు ఎర్రని రంగు మెరిస్తోంది.

"ఆ విజయమ్మ ఈ అప్సరసలా ఎలామారిందా" అని ఆశ్చర్యపోయాడు. పైగా ఇంత చదువు ఎలా చదివిందో ఊహించుకోలేకపోయాడు శేఖర్ అతని మనస్సులో భార్యమీద చెప్పలేని అనురాగం పొంగివచ్చింది. తన తప్పు సరిదిద్దుకుని ఆమెను స్వీకరించాలను కున్నాడు.

"జయాదేవి నన్నుక్షమించు. మనింటికి వెళ్ళిపోదాంరా"

"మిస్టర్ శేఖర్! ఆ మాట ఎంత తేలిగ్గా అనగలిగావు. ఆనాడు నాకు అందంలేదు. చదువులేదు. డబ్బులేదు, అందుకే నేను అవసరం లేకపోయాను. ఈనాడు నేను ఈ అంతస్తులో నిలిచేటప్పటికి నీకు అవసరం వచ్చాను. / కాని నా అంతస్తుకు నువ్వు తగుతావేమో ఆలోచించావా? దిక్కులేని దానిలా వదిలేసి వెళ్ళిపోయావు. ఆ అవమానం భరించలేక నా తల్లి తండ్రులు చచ్చిపోయారు. ఆ శోకకలోనుంచి నాలో రగిలిన ఆవేశంతో నేను చదువుకుని ఈస్థితికి వచ్చాను నువ్విక్కడ ఉన్నవని నాకు తెలుసు. నేనెవ్వరినో తెలియ చెప్పడానికి ఇక్కడకు వచ్చాను. నీతో కాపరం చెయ్యడానికికాదు, నేను ఆఫీసర్నన్నే విషయం మర్చిపోకు. గెట్ అవుట్! అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి, జయాదేవి మాజీ భర్త శేఖర్ కళ్ళు ఒత్తుకుంటూ బయటకు వచ్చాడు. అదేమిటో సరిగా అర్థంకాని జనం కంగారు పడ్డారు. శేఖర్ అంతటివాడే ఆవిడగారికీ భయపడితే బుద్ధిగా పనులు చేసుకోడం మంచిదనుకున్నారు అంతా.

గడియారం 5 గం॥ కొట్టింది. జయాదేవి సీట్లోంచి లేచింది, పి.ఎ ఫైల్సు పట్టుకుని ముందునడిచాడు, అతని వెనకే జయాదేవి నడిచింది. అందరితోపాటు శేఖర్ కూడా లేచి నిలబడ్డాడు.

జయాదేవి వెళ్ళి కూర్చోగానె కారు కదిలి వెళ్ళిపోయింది.

(విశ్వరచనలో బహుమతిపొందిన కథ)